# దాహం! దాహం!!

ఆబిదా ఖాన్

అదొక మురికివాడ. అయితే ఇప్పుడక్కడ చాలా మార్పులు వచ్చాయి. ఇదివరకు ఆ ప్రాంతమంతా బురద, బురదగా ఉండేది. ఆ బురదలో ఎప్పుడు పందులు, కుక్కలు సయ్యాటలాడుకునేవి. దోమలకుకూడా మంచి తిండి దొరికేది. అంతేకాదు, పిల్లలు ఆడుకోవడానికి కూడా అదే ఆటస్థలం! కానీ, ఇప్పుడు అక్కడ అలాంటిదేమీ కనబడడం లేదు. నీళ్ళుంటేగా బురద ఉండడానికి.

"ఒసేయ్ లచ్చీ" బయటనుంచి కేకేశాడు రిక్షారాజయ్య.

"ఏట మావా?" లోపలనుంచే అడిగింది లచ్చి.

"నేనెడుతున్నానే"

"మావా ఉండు ఓ సిన్నమాట" పరుగెత్తుకొచ్చింది.

"ఏంటెహే సెప్పు తొందరగా!" తొందర చేశాడు రాజయ్య.

"కూటికి పైసలు లేవు మావా!"

"లేకపోతే నేనేం సెయ్యాలే! ఈపొద్దు ఏవన్నా గిరాకితగిలితే పైసలుతెత్తానే! దాంట్లో కూడా సహం ఓనరోడికియ్యాల! మన బతుకులింతేనే!

రాజయ్య మాటల్లో ఆవేదన

"ఈపొద్దు నీళ్ళుకూడా లేవుమావా" లచ్చి కళ్ళల్లో తడి.

"కూడూలేదు. నీళ్ళూ లేవు. ఏంటే మన బతుకులు" రాజయ్య కళ్ళల్లో అసహాయత!

దూరంగా నీళ్ళటాంకు వస్తూ కనపడింది.


"నీళ్లబండొస్తున్నాది. కుండలు తీసుకురావే" భార్యను పురమాయించాడు.

"అంత గుంపులోకి నేనెల్లి తీసుకురాలేను మావా" నీళ్లు పట్టిచ్చి ఎల్లవా! చంటోడుబువ్వ తిని రెండ్రోజులు అయింది. లేచినకాడి నుంచి గొంతెండుకుపోయి ఏడుత్తున్నాడు మావా"

"లేదే లచ్చీ! తెల్లారే గిరాకి తగులుద్దే ఇస్కూళ్ళకుపోయేటోళ్ళు ఎక్కుతారే?"

"నీళ్లబండి రాగానే మందలోకి దూరే! నాకూ దాహంగా ఉందే. ఆ పెక్కడయినా బయట తాగేత్తాలే. వత్తా" అని రిక్షా గంట కొడుతూ వెళ్ళిపోయాడు.

"అమ్మా నీళ్లియ్యవే" కలవరిస్తున్నాడు చంటోడు. ఆ మురికివాడలో స్నానం అనే కాలకృత్యాన్ని అందరూ మరచిపోయారు. వాళ్ళ శరీరాలన్నీ కంపుకొడుతున్నాయి. ఎప్పుడో మూడురోజులకోసారి నీళ్ళటాంకర్ వస్తే ఓకుండ నీళ్ళు దొరకడం కష్టంగా ఉంటే ఇక స్నానాలేం చేస్తారు?



"పెంటమ్మత్తో!"

"వ త్తన్నానే! బిడ్డా" చెక్క దువ్వెనతో పేలు తీసుకుంటున్న పెంటమ్మ తొంగిచూసింది.

గ్లాసు పట్టుకుని బయట నిలబడ్డ లచ్చిని చూసి గతుక్కుమంది.

"కాసిని నీళ్ళుంటే పొయ్యత్తా! పిల్లోడు దాహంతో అల్లాడుతున్నాడు" దీనంగా అడిగింది.

"నీళ్లా?" పరిహాసంగా నవ్వింది పిచ్చమ్మ

"నీళ్ళెక్కడే తల్లీ! నిన్నటలు నీళ్ళబండే రాలే"

"గుక్కెడు నీళ్ళివ్వత్తా! పిల్లోడు గొంతు తడుపుకుంటాడు. బ్రతిమాలింది లచ్చి.

"ఒసేవ్! నువ్వు సెబితే ఇనిపించుకోవు కానీ ఇట్రా" అని చెయ్యిపట్టి లోపలికి లాక్కెళ్ళింది.

"సూడే తల్లీ! సూడు" అంటూ కుండల మూతలు తీసి చూపించింది. అన్నీ ఖాళీగా వెర్రిమొఖాలు వేసుకుని ఉన్నాయి. నిరాశగా వెనక్కు తిరిగింది లచ్చి.

పిచ్చమ్మ అన్నీ చూపించింది కానిలోపల గుంట్లో సత్తుగ్లాసునిండా దాచిపెట్టుకున్ననీళ్ళు మాత్రం చూపించలేదు.

నీళ్ళకోసం అందరిళ్ళూ తిరిగి అలసిపోయింది. కానీ గుక్కెడు నీళ్ళు దొరకలేదు లచ్చికి. ఖాళీ చేతులతో ఇంటికి వచ్చింది.

చంటోడు దాహం తీరక నీరసంగా పడి ఉన్నాడు. లచ్చికి గుండెల్లో దేవినట్లయింది. కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంగా ఆమె ప్రమేయం లేకుండానే జారిపోతున్నాయి. కళ్ళ నుంచి జారుతున్న నీళ్ళతోపాటు క్రమంగా వెక్కిళ్ళుకూడా రాసాగాయి. వెక్కిళ్ళు ఆపుకోవడానికి పైటతీసి నోటికి అడ్డం పెట్టుకుంది.

❊ ❊ ❊

కాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చిన దానిలా విసురుగా లేచింది లచ్చి. నేరుగా వంటింట్లోకి వెళ్లి బోర్లించిపెట్టిఉన్న సత్తుగిన్నెను కొంగుచాటున దాచిపెట్టుకుంది.

ఆ సత్తుగిన్నె కడిగి ఎన్ని రోజులైందో! అర అంగుళం ఎత్తున దుమ్ము పేరుకునివుంది దాన్ని కొంగుతో శుభ్రంగా తుడిచింది.

బయటకు వచ్చి అటూ ఇటూ చూసింది. ఎవరూ గమనించడం లేదన్న నిర్ణయానికి వచ్చిన తర్వాత గబగబా సందులోకి దూరింది ఆమురికివాడనుంచి చాలా దూరం వచ్చాక కొంగుచాటునుంచి సత్తుగిన్నె తీసింది.

"అమ్మా! గంగమ్మతల్లీ! కొంచెం నీళ్ళు దానం చెయ్యితల్లీ నీకు పుణ్యం ఉంటుంది" గొంతు చించుకొని చాలాసేపు అరిచింది.

లోపలినుంచి ఎవరూ రాలేదు. విసుగేసింది లచ్చికి గేటు తీసుకొని లోపలికి వెళ్ళింది.

"ఎవరూ" అంటూ ఓ ముసలావిడ బయటకు వచ్చింది.

"ఓ గుక్కెడు నీళ్ళుపొయి తల్లీ" మళ్ళీ అరిచింది లచ్చి.

"ఓసినీ! బిచ్చగత్తెవశే. మట్టంలా వచ్చి గడియతీస్తావా? వెళ్ళు వెళ్ళు" కసిరింది.

ఇకలాభం లేదని వేరే ఇంటికి వెళ్ళింది.

"తల్లీ! కూసిని నీళ్ళుదానం చెయ్యితల్లీ"

ఎవరూ పలకలేదు.

పిలిచి పిలిచి గొంతు ఎండిపోతున్నది లచ్చికి.

"నీళ్ళులేవు అన్నంఉంది పెట్టనా!"

"బువ్వొద్దు తల్లీ! నీళ్ళుసుక్కెయ్యమ్మా. నీకు పుణ్యం ఉంటుంది" కాళ్ళుపట్టుకుని బ్రతిమాలింది.

ఏమనుకుందో ఏమో లచ్చి స్థితిచూసి ఆ తల్లిమనసు కలుక్కుమందేమో ఓ గ్లాసెడు నీళ్ళు తీసుకొచ్చింది.

కానీ, అప్పటికే లచ్చికి శోష వచ్చి పడిపోయింది.

"హు! ఉదయాన్నే ఈ తద్దినం నాగుమ్మం లోపడిందే" గొణుక్కుంటూ తలుపులు విసురుగా వేసుకుంది.

❊ ❊ ❊

ఎండ చురుక్కుమనిపిస్తుంటే మెలకువ వచ్చింది లచ్చికి. నెమ్మదిగా లేవడానికి ప్రయత్నించింది, కానీ లేవలేక పోతోంది. ఎలాగో గేటు ఆసరా చేసుకొనిలేచి సత్తుగిన్నె కోసం అటూ ఇటూ చూసింది. తను పడిపోయింది రోడ్డుమీద!

ఇంకా ఎక్కడుంటుంది ఎవరోకొట్టేశారు అంతాచుట్టూమూగి సర్కస్ చూసినట్టు చూస్తున్నారు. (ఫ్రీగా) చూస్తున్నారేకానీ ఎందుకు పడిపోయావు ఏమిటిఅని ఒక్కరూ అడగల్లేదు.

ఉసూరుమని ఇంటికొచ్చింది. చంటోడు ఇంతకుముందు ఏడుస్తున్నాడు ఇప్పుడు ఏడవడానికి కూడా ఓపికలేక నిస్త్రాణంగా పడుకున్నాడు.

"నీళ్ళబండివస్తుందహో!"పిల్లలుతాయిలం కోసం అన్నట్టు అరుస్తున్నారు. అందరూ చేతికేది అందితే అదిపట్టుకొని పరుగులు తీస్తున్నారు ఒకరింట్లో నలుగురుంటే నలుగురూ బిందెలు పట్టుకొని పరుగులు తీస్తున్నారు. ఒకర్నొకరు తోసుకుంటూ వెనకెవరో తరుముకొస్తున్నట్లు పరుగులు తీస్తున్నారు.

లచ్చికూడా ఓమూల బోర్లించిఉన్న కుండ తీసుకొని పరిగెత్తింది. వాటర్ టాంక్ దగ్గర ఇసుక వేస్తే రాలనంతజనం అందర్నీతోసుకుంటూ వెళ్ళి ఎలాగైతేనేం కుండనిండానీళ్ళు పట్టుకుంది కుండనీళ్ళకోసం లచ్చిఇన్నాళ్ళూ ప్రాణప్రదంగా చూసుకుంటున్నగాజులు పగిలిపోయాయి. అయితేనేం? కుండెడునీళ్ళు దొరికాయి.

అన్నంతిని రెండ్రోజులైంది. లచ్చికళ్ళు తేలిపోతున్నాయి శోషవచ్చేటట్టుంది కాళ్ళు తడబడుతున్నాయి అయినా దొరికిన కుండెడు నీళ్ళను ప్రాణప్రదంగా తెచ్చివంటింట్లోదించింది సత్తుగ్లాసులో నీళ్ళుముంచుకొచ్చి—

"అరే సంటోడా లెగరా లెగు! లేసికూకుని నీళ్ళు తాగరా గ్లాసు కిందపెట్టి చంటోడిని లేపబోయింది కాని అప్పటికే..●

ధరలు తగ్గిన తర్వాత

"మీ నాన్న నాకిస్తానన్న స్కూటర్ ఇంతవరకు ఇవ్వలేదు" అన్నాడు భర్త.

స్కూటర్ కొని రెండు నెలలైంది అయితే హెల్మెట్ ధరలు తగ్గిన వెంటనే ఇస్తారట" చెప్పింది భార్య.

జి. ఖాజావలి కదిరి

